# విశాలాంధ్ర గోదావరి జిల్లా
## ఏలూరు, పశ్చిమగోదావరి

## రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు**

**విశాలాంధ్ర -భీమవరం:** రాష్ట్రానికి విభజన హామీలు, ప్రత్యేక హెూదా ముగిసిన అధ్యాయం కాదని, ప్రత్యేక హెూదా సాధనకై వీధి పోరాటాలకు సిద్ధం కావాలని ప్రత్యేక హెూదా తమ మేనిఫెస్టో లో ప్రకటించిన పార్టీలకే పట్టం కట్టాలని ప్రత్యేక హెూదా ఇస్తానని మోసం చేసిన మోడీని గద్దె దించాలని, హెూదాపై నోరు ఎత్తని వైసిపి, టిడిపి, జనసేనలను బుద్ధి చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో రాష్ట్రానికి ప్రత్యేకహెూదా, విభజన హామీలు అమలు కోరుతూ మంగళవారం గాంధీ వర్ధంతి, అమర వీరుల దినం పురస్కరించు కొని గాంధీచిత్ర పటానికి పూలమాలవేసి ఆంధ్రుల హక్కుల ఆత్మ గౌరవ దీక్షను సిపిఐ , సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్, కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ 2014లో ఎపి విభజన సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా ఎపికి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ లోటు 18,000 కోట్లు భర్తీ చేస్తామని, పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా నిర్మిస్తామని, రాజధాని నగరాన్ని నిర్మిస్తామని, గంగవరం పోర్టు, కడప ఉక్కులతో ప్రగతి చూపిస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని, విశాఖ రైల్వే జోన్ ఇచ్చి లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదని కోనాల మండిపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె.ఎన్.వి గోపాలన్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ను విడదీసినప్పుడు పార్లమెంట్‌లో ఆనాడు బిజెపి పార్లమెంట్‌లోనూ, మోడి ఆంధ్ర రాష్ట్రానికి వచ్చినపుడు ఆంధ్ర రాష్ట్రానికి 10 సంవత్సరాలు పాటు ప్రత్యేకహెూదా ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మోడి అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలైందని, ఇంతవరకు రాష్ట్రానికి ప్రత్యేక హెూదా రాష్ట్రానికి ప్రకటించకుండా బిజెపి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిం దన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, కాంగ్రెస్ భీమవరం అసెంబ్లీ ఇన్ ఛార్జ్ తమలంపూడి వంశీ మోహన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ నాయకులు నాగిడి శాంతమూర్తి,కె.మల్లేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు కనుమూరి వెంకటపతిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంధి వసంత్ కుమార్, సిపిఎం కార్యకర్తలు కలిదిండి సత్యనారాయణ,ఎం. ఆంజనేయులు, దేగల నాగు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### పరిశ్రమల్లో భద్రత పటిష్ఠం చేయాలి

**- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్**

**విశాలాంధ్ర-ఏలూరు :** జిల్లాలో వున్న వివిధ పరిశ్రమల్లో అగ్నిమాపక మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. మంగళ వారం కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ మీటింగ్ జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణా చర్యల్లో భాగంగా అగ్నిమాపక మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రతాచర్యలు తీసుకునేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారని, మరొక మారు 15 రోజులు పనిదినాల గడువుతో అయా పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు జారీచేయా లని జిల్లా ఫైర్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అప్పటికీ ఆయా యాజమాన్యాలు స్పందించని పక్షంలో సెక్షన్-12 కింద కేసు నమోదుకు చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుకుండా భద్రతాచర్యలను మరింత పటిష్టం చేయాలన్నారు. ఈమేరకు జిల్లాస్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మికశాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్యనియంత్రణామండలి, అగ్నిమాపకశాఖ, పోలీసు, రవాణా, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి యం. వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్డిఓ ఎస్ఎస్ కె. ఖాజావలి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఛీఫ్ ఇన్స్పెక్టర్ ఆర్. త్రినాధరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఉప రవాణా కమిషర్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

### పశ్చిమగోదావరి జిల్లా నూతన ఎస్పిగా అజిత

**విశాలాంధ్ర -భీమవరం టౌన్ :** పశ్చిమ గోదావరి జిల్లా నూతన ఎస్పిగా వేజెండ్ల అజిత బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఎస్ పి గా ఉన్న రవి ప్రకాష్ ను ఏసీబీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అజిత తెలుగు అమ్మాయి. వీరిది గుంటూరు జిల్లా తెనాలి. రూ.5లక్షల వేతనంతో పనిచేస్తున్న సాఫ్ట్వేర్ రంగాన్ని వదిలేసి పట్టుదలతో ఐపీఎస్ సాధించారు. ఈ జిల్లాకు నూతన ఎస్పి గా రావడంతో ఇద్దరు జిల్లా ఉన్నత అధికారులు మహిళలే కావడం విశేషం.!

### కలెక్టర్‌ను కలిసిన రాజేంద్రన్

**విశాలాంధ్ర-ఏలూరు:** నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేసి పదోన్నతి పై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించబడిన ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూజివీడు సబ్ కలెక్టర్‌గా సేవలందించి పలువురు మన్ననలు పొందిన ఆదర్శ్ రాజేంద్రన్ సమర్థవంత మైన, మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

### గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేసిన సీఎం జగన్

**విశాలాంధ్ర-ఏలూరు:** గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు పరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో స్థాయిసంఘం వారీగా జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు పరిచిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ లు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం, తదితర ప్రాధాన్యత పనులను చేపట్టి గ్రామ ప్రజలకు ఎంతో మేలు చేశారని తెలిపారు. గతంలో ఏప్రభుత్వాలు చేపట్టలేని అనేక సంక్షేమ పథకాలు నవరత్నాలు ద్వారా ప్రజలకు నూరుశాతం అందించారని చెప్పారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు రాబో తున్న సందర్భంగా స్థాయి సంఘం సమావేశం చివరిసారిగా నిర్వహించుకుంటు న్నామని తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఈ సమావేశంలో ప్రణాళిక, ఆర్థికస్థాయి, పనులు స్థాయి, గ్రామీణాభివృద్ధి స్థాయి, విద్యా , వైద్య సేవలు స్థాయి, మహిళా సంక్షేమం స్థాయి, సాంఘీక సంక్షేమం స్థాయి సంఘాల సభ్యులు అధికారులతో సంబంధిత అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతి పురోగతిపై సమీక్ష చేశారు. ఈ సమావేశానికి ముందు జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సంఘ సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్.సుబ్బారావు, జెడ్పి డిప్యూటీ సిఇఓ నిర్మలాజ్యోతి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వివిధ శాఖల అధికారులు, జెడ్పి టీసిలు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర-నరసాపురం:** క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్ర మంలో భాగంగా జరిగిన ఆటల పోటీలు సచివాలయాల స్థాయి నుండి మండలం, అర్బన్, నియోజక వర్గం స్థాయిలో ముగించు కుని జిల్లా స్థాయికి చేరుకున్నాయి. ఈ సంద ర్భంగా నరసాపురం నియో జకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం స్థానిక వైఎన్ కళాశాల ప్రాంగ ణంలో బహుమతులు అందించే కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు ఎస్ ఎం. పాజిల్, జి, అనిత కుమారి, ఎంపీడీవోలు, ఎస్.వి.రమణారావు, యు. బాబ్జి రావు, కౌన్సిలర్లు సిర్ర కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ప్రకటన**

**మన ఏలూరు** లో ఆశ్రం హాస్పటల్స్ వారు దెందులూరు, పెదపాడు అను గ్రామాలను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (DME ) వారి అనుమతి మేరకు దత్తత తీసుకొని ఆ రెండు గ్రామాలలో ప్రతీ నెల వివిధ స్పెషాలీటీ డాక్టర్లుతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించి అందరికీ ఉచితముగా మందులు పంపిణీ చేయుచున్నాము. అవసరమైన వారికి ఆపరేషన్స్ కూడా ఆశ్రం హాస్పిటల్స్ నందు ఉచితముగా నిర్వహించబడును. మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు EHS ద్వారా వైద్య సేవలు అందించబడును.

అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్
మల్కాపురం, ఏలూరు-534005, ఏలూరు జిల్లా,
ఫోన్ 08812-288288/288299

### ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : డీఆర్వో

**విశాలాంధ్ర -భీమవరం:** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ డిఆర్ఓ ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఇంటర్మీడి యట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జిల్లా కమిటీ సభ్యులు విద్యాశాఖ, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు మూడు దశలుగా నిర్వహించనున్నట్లు అన్నారు. ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3వ తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలను ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పనిసరిగా వ్రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 111 పరీక్షా కేంద్రాల్లో 17,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (ఒకేషనల్), ఫిబ్రవరి 11 వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (జనరల్) నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్స్పెక్టర్, కన్వీనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ కె.చంద్రశేఖర్ బాబు, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె.వి సత్యనారాయణ, కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, ఎం. నరసింహ మూర్తి, ఎ.రాజ్ కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఆర్టీసీ పీ.వో గీతాదేవి, తదితర, అధికారులు పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీతో అదనపు ప్రయోజనాలు

**విశాలాంధ్ర - కైకలూరు :** వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీతో అదనపు ప్రయోజనాలు, కొత్త ఫీచర్లతో పేదలకు వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం పరిమితి రూ. 25 లక్షలు వరకు పెంచి వారి ఆరోగ్య చరిత్ర కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులో నిక్షిప్తమయ్యేలా చేసి ప్రతి పేదవానికి గడపకే వైద్యం తీసుకువచ్చి వారికి గల సమస్యలను గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్న జగన్ గారికి ధన్యవాదములు కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరు మండలంలోని వింజరం గ్రామ సచివాలయ పరిధిలోని జరిగిన 2వ దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్,వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్,మాడపాటి బాబు, గోళ్ళ సూరిబాబు,మీగడ వెంకట నాంచారయ్య, జొన్నల రామస్వామి, పుచ్చా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలతో పోలీసులు మమేకమవ్వాలి

**విశాలాంధ్ర - లింగపాలెం :** చింతలపూడి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడటంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని సీఐ ఎం.సుధాకర్ తెలిపారు. సీఐగా బాధ్యతలు చేపట్టాక ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన ఈయన విశాలాంధ్రతో మాట్లాడుతూ పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహిస్తే ప్రజల నుంచి ఆదరణ ఉంటుందని అన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాల్సి ఉందని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులను అప్రమత్తం చేస్తానని వివరించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచుతానని అన్నారు. ప్రజలతో మమేకమయ్యేందుకు గ్రామాల్లో పర్యటిస్తానని, దీనివల్ల శాంతి భద్రతలను అదుపులో ఉంచటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నేరస్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రజలతో పోలీసులు మంచి సంబంధాలు కలిగి ఉండేలనేది తన అభిప్రాయమని, దీనిని అనుసరిస్తానని వివరించారు. ఈయనతోపాటు ఎస్ఐ చెన్నారావు ఉన్నారు.

### సబ్ కలెక్టర్‌గా ఆదర్శ రాజేంద్రన్ సేవలు మరువలేనివి

**విశాలాంధ్ర - లింగపాలెం :** నూజివీడు సబ్ కలెక్టర్‌గా 15 నెలలపాటు పనిచేసి నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్తున్న ఆదర్శ రాజేంద్రన్ సబ్ కలెక్టర్‌గా చేసిన విధి నిర్వహణపై ప్రతీ ఒక్కరు ప్రశంసిస్తున్నారు. ఆదర్శంగా విధులు నిర్వహించారని ఉద్యోగులు, ప్రజలు అంటున్నారు. ప్రధానంగా లింగపాలెం మండలంలో ఈయన ఎన్నో సమస్యలను పరిష్కరించారని కొనియాడుతున్నారు.

భోగోలు గట్టును అక్రమంగా తవ్వేస్తుంటే దీనిని అడ్డుకుని గట్టుకు రక్షణ కల్పిం చారు. లింగపాలెం, చింతలపూడి, కామవరపుకట మండలాల నుంచి అక్రమంగా తరలిస్తున్న సుద్ద రవాణాను అరికట్టారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఒక గ్రామ రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేశారు. స్పందనలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పరిష్క రించటంలో ఫిర్యాదుదారులు నుంచి హర్షాతిరేకాలు వచ్చాయి. కేరళ రాష్ట్రానికి చెందిన ఆదర్శ రాజేంద్రన్ ఐఎఎస్ సాధించి మొదటిసారి నూజివీడు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన సేవలు ఆదర్శనీయమంటూ పలువురు అధికారులు, ప్రజలు ఈయనను కలిసి అభినందించి వీడ్కోలు పలికారు.

### సమస్యలకు నిలయం జగనన్న కాలనీ

**విశాలాంధ్ర - ఉంగుటూరు :** ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు జగనన్న ఇళ్ల కాలనీ వాసులు కష్టాలతో బాధపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించాలన్న ధ్యేయంతో జగనన్న ఇళ్ల కాలనీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అధికారులు మాత్రం ఆశించిన స్థాయిలో పనిచేయటం లేదు. కాలనీలో రూ.7 లక్షల నిధులతో తాగునీరు కోసం వేసిన బోరు పాడైపోయింది. బోరుకు సంబంధించి పైపులు నాసిరకం వేయడంతో బోరు లోపల పైపులు పగిలిపోయి బురద నీరు, ఇసుక వస్తున్నది. దీంతో కాలనీవాసులు తాగునీరు కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించడం కోసం మండల నిధుల నుండి మరో రూ.1 లక్ష 20 వేల తో 10 హెచ్ పి మోటార్ బిగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బోరు వద్ద మోటర్ దిగిపోవడం జరిగింది. కేవలం కేబుల్ వైరు పట్టుకుని ప్రమాద భరితంగా ఉంది. బురద నీరే వస్తుంది. పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్ల దగ్గరికి వెళ్లి మంచినీరు తెచ్చుకుంటున్నారు. మంచినీరు కోసం పెట్టిన రూ.20 వేలు నిధులు బూడిద పాలయ్యాయి. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు తాత్సార్య చేస్తున్నారు. ఆ బోరు సంగతి వదిలేయండి మరో రూ.7 లక్షలతో కొత్త బోరు వేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రజా ప్రతినిధికి చెప్పటం జరిగిందని తెలిసింది. కాలనీ వాసులకు మూడు గజాల రోడ్డు మాత్రమే ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచ్ తమ్మిన శ్రీనివాస్ దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. అయన పక్కన రైతుతో మాట్లాడి ఒక గజం బారున మూడు సెంట్లు స్థలం రైతు వద్ద నుండి తీసుకున్నాడు. స్థలం ఇచ్చిన రైతుకు ఆ స్థలానికి సంబంధించి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతు రోడ్డుకు ఎంత స్థలం ఇచ్చాడో అక్కడ రాళ్లు పాతాడు. కాలనీ వాసులకు ఇళ్ల నిర్మాణం కోసం వెళ్లే వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. జగనన్న కాలనీలో రెండు సమస్యలు ఉంటే అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. జగనన్న కాలనీలో 37 ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వారిలో ఐదుగురు మాత్రమే ఇల్లు నిర్మించుకున్నారు. తాగునీరు, రోడ్డు సమస్య ఉండటంతో లబ్ధిదారులు ఎవరు ఇల్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. కొందరు లబ్ధిదారులు బేస్మెంట్ వరకు నిర్మించుకుని అసంపూర్తిగా వదిలేశారు.

**సర్పంచి వివరణ :** జగనన్న ఇళ్ల కాలనీలో త్రాగునీరు, రోడ్డు సమస్య పై గ్రామ సర్పంచి తమ్మిన శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆ రెండు సమస్యలు వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని ఇద్దరు అధికారులు దృష్టికి తీసుకెళ్లానన్నారు.

**తాగునీరు సమస్య పరిష్కరిస్తాం : అధికారులు :** యర్రమిల్లిపాడు గ్రామంలో జగనన్న ఇళ్ల కాలనీలో తాగునీరు, రోడ్డు సమస్య పరిష్కరిస్తామని అధికారులు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. మంగళవారం అధికారులు కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు తాహసిల్దార్ ఏవి రమణారావు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏ ఈ సురేష్, గ్రామ సర్పంచ్ తమ్మిన శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి అల్లు సుధారాణి, ఆర్డబ్ల్యూఎస్ వర్క్ ఇన్స్పెక్టర్ జానీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రి చేయాలి

**విశాలాంధ్ర - గణపవరం:** రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్‌పార్టీని గెలిపించి మరల జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మంగళవారం గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో గణపవరం మండల స్థాయి కార్యకర్తలు విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సిద్ధ శుద్ధితో పనిచేసి వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి నవరత్నాలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి వివరించాలని వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ గెలిపించాలని ప్రజలకు వివరించే బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము), జడ్పిటీసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ దండు రాము, వైయస్సార్ టీఎఫ్ జిల్లా నాయకులు కాకర శ్యామ్ సుందర్( సన్), వైఎస్ఆర్ పార్టీ నాయకులు చనుమూరి శివ, రొంగల శ్రీను, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### విశాలాంధ్ర విలేఖరి కృష్ణబాబుకు మాతృవియోగం

**విశాలాంధ్ర-ఏలూరు:** కొయ్యలగూడెం విశాలాంధ్ర విలేఖరి పి. కృష్ణ బాబు మాతృమూర్తి సుబ్బాయమ్మ సోమవారం రాత్రి అనారోగ్యంతో ఇంటివద్ద మృతి చెందారు. సుబ్బాయమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుబ్బాయమ్మ మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సహాయ కార్యదర్శి, ఉప్పులూరి హేమ శంకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అర్. శ్రీనివాస్ డాంగే, విశాలాంధ్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో బెజవాడ బ్రహ్మయ్య, టౌన్ రిపోర్టర్ మట్టా మాణిక్యాలరావు, పలువురు సంతాపం తెలిపారు.

### టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

**విశాలాంధ్ర-టి నరసాపురం:** టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన టి నరసాపురం హైవే పై మంగళవారం జరిగింది.వివరాలు ఇలా ఉన్నాయి .టి నరసాపురంలో నూతనంగా నిర్మితమవుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పై మట్టిని తరలిస్తున్న టిప్పర్ కూలిపని నిమిత్తం వెళుతున్న టి నరసాపురం గ్రామానికి చెందిన పెసనగంటి మరియన్న(58)ను ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని భార్య బుజ్జి ,కుమారుడు మంగరాజులు తమకు న్యాయం జరిగేవరకు మృతదేహాన్ని తరలించడానికి వీలులేదని కొంతసేపు ధర్నా నిర్వహించారు .అనంతరం పోలవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి లంకా జయబాబు ఆధ్వర్యంలో టి నరసాపురం ప్రధాన సెంటర్లో రహదారిని నిర్బంధించి ధర్నా చేసారు. ఈ సందర్భంగా జయబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ధర్నా విరమించేది లేదని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. సంఘటనా స్థలాన్ని జీలుగుమిల్లి సిఐ క్రాంతికుమార్ సందర్శించి టిప్పర్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో పల్లిపాం జోసెఫ్ తంబీ, నాగేంద్రబాబు, బర్రె సత్యనారాయణ, నందిపాం రవి తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐకి విరాళాలు ఇచ్చి ఆదరించండి

**జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య**

**విశాలాంధ్ర - బుట్టాయిగూడెం:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐకి విరాళాలు ఇచ్చి ఆర్థికంగా సహకరించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విజ్ఞప్తి చేశారు. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో బుట్టాయిగూడెం మండల కేంద్రంలో నిధి వసూళ్ల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో కృష్ణ చైతన్య మాట్లాడుతూ సీపీఐ ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిర్విరామంగా పోరాటం చేసి, పేదల పక్షాన మేమున్నామంటూ భరోసా కల్పిస్తోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మతతత్వ, అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదను వృద్ధి చేయకుండా పోరాటాలతో సాధించుకున్న సహజ వనరులను, సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించటం మోదీ పాలనలో నిత్యకృత్యంగా మారిందని విమర్శించారు. రోజురోజుకు ధరలు పెంచుతూ సామాన్య ప్రజలు జీవించటానికి అవకాశం లేని విధంగా పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలందరూ విరాళాలు ఇచ్చి ఆర్థికంగా సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బుట్టాయిగూడెం మండల కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయి బాబా,బాడిస రాము, జిల్లా సమితి సభ్యులు కరటం వెంకటేశ్వర్లు, నాయకుడు సూర్యచంద్రరావు, మడకం దుర్గారావు, గంగాదేవి, ఉండి నాగరత్నం, తెల్లం వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### స్పర్శ లేని మచ్చలుంటే ఆరోగ్య సిబ్బందికి తెలవాలి

**విశాలాంధ్ర - గణపవరం:** గ్రామాల్లో ప్రజలు స్పర్శ లేని మచ్చ ఉన్న వారు ఆరోగ్య సిబ్బందికి తెలియ జేయాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం సరిపల్లె గ్రామపంచాయతీ వద్ద గాంధీ వర్ధంతి సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ చనుమూరి లక్ష్మీ భవాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాధిపై 15 రోజులు పాటు ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తారని ఎవరికైనా ఒకటి,రెండు,స్పర్శ లేని మచ్చలు ఉన్న రాగి రంగుతో కలిసి ఉన్న మచ్చలు ఉన్న అలాంటివి ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలపాలని ఆమె అన్నారు. ఉంటే వారికి మల్టీ డ్రగ్ తెరపి ద్వారా మందులు వాడితే ఏ విధమైన లోపం ఉండదని వైద్యాధికారి తెలిపారు. కార్యకర్తలు ఇంటింటా తిరిగి కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరికి పూర్తిగా అవగాహన కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి జె విల్సన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దైబాల రామాంజనేయులు, కొరువాడ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు ఎంఎస్ యోహన్ నల్లయ్య, గేదల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### దళిత జేపీసీ ఆధ్వర్యంలో 40 మందికి కుట్టు మిషన్ల పంపిణీ

**విశాలాంధ్ర -భీమవరం:** మహిళా సాధికారతకు రాజ్ ట్రస్టు అందిస్తున్న సహకారం అమూల్యమని పలువురు వక్తలు ప్రశంసిం చారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో దళిత జెఏసి ఆధ్వర్యంలో 40 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ఉచితంగా రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్ కుమార్ సౌజన్యంతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మహిళలకు ఉచితంగా కట్టుమిషన్లు పంపిణీ చేయటం అభినందనీయమని రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్ ను అభినందించారు. ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు వేలాది మంది విద్యార్థులు, మహిళలు లబ్ధి పొంది స్వావలంబన పొందారని అనేక మంది వృద్ధులు, రోగులు, బలహీనులు పింఛన్లు పొందుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సిపి పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కొడే యుగంధర్, చెల్లబోయిన సూర్యప్రకాష్ చేతుల మీదుగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్ ట్రస్టు వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్, దళిత జెఏసి కన్వీనర్ యేలేటి న్యూటన్, పశుగణాభివృద్ధి సంస్థ డైరక్టర్ గంటా సుందరకుమార్, విజిలెన్స్ కమిటీ మెంబర్స్ బాలకృష్ణ, కొప్రపాటి అనిత, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, గాదిరాజు రామరాజు, బొత్స ధర్మ, కేసి రాజు. రామకృష్ణ వర్మ, కడలి శ్రీనివాస్, దుర్గ, కందికట్ల సాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### పదవీ బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ సహాయ కమిషనర్ శ్రీవిద్య

**విశాలాంధ్ర -భీమవరం:** భీమవరం పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎ.శ్రీవిద్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో ఏవో ఆమె భీమవరం బదిలీపై వచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

### లివర్ వ్యాధిగ్రస్తునికి త్రిమూర్తులు వితరణ

**విశాలాంధ్ర -భీమవరం:** ప్రార్థించే పెదవుల కంటే సహాయం చేసే చేతులు మిన్నని, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం మానవ ధర్మమని కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా త్రిమూర్తులు అన్నారు. లివర్ క్యాన్సరుతో బాధపడుతున్న కప్పిరి మనోహర్ కు గంటా త్రిమూర్తులు, నాగలక్ష్మి దంపతులు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ మనోహర్ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు వారికి అందించామని మరింత మంది దాతలు ముందుకు వచ్చి మనోహరును ఆదుకోవాలన్నారు. ఇటీవలే మనోహర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారని ఆవిడకి కూడా గతంలో రూ. 10 వేలు సహాయం అందించామని అన్నారు. కార్యక్రమంలో గంటా నాగలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు మద్దుల రాము, మైలబత్తుల ఐజాక్ బాబు, చెల్లబోయిన సుబ్బారావు, బిసి సెల్ నాయకులు యలమంచిలి శ్రీను, కందుకూరి ప్రకాష్, కుమార్ నాగరాజు, కుమారి ముత్యాలమ్మ, గోగులమ్మ, తత్తురి అంజమ్మ, శ్రీలమ్మ, కందుకూరి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఫోక్సో కేసు నమోదు

**విశాలాంధ్ర - లింగపాలెం :** మైనర్ బాలికను లైంగికంగా వేధించిన బాదరాలకు చెందిన సి.వీరాస్వామిపై ధర్మాజీగూడెం పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. బాధితురాలు తల్లి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కోవిడ్‌తో మృతి చెందిన వైద్యులంతా అమరవీరులే

**విశాలాంధ్ర -భీమవరం టౌన్ :** కోవిడ్ మహమ్మారి దేశం మీద విజృంభిస్తున్న సమయంలో వైద్య సహకారాలు అందించి అమరులైన వైద్యులంతా అమరవీరులేనని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ జి. బాలకృష్ణంరాజు, డా.ఎన్ శంకర్ కుమార్ వర్మ అన్నారు. మంగళవారం భీమవరం లీలాకృష్ణ గ్రాండ్ లో ఐఎంఏ భీమవరం శాఖ ఆధ్వర్యంలో కోవిడ్ అమర వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్లో సుమారు 124 మంది వైద్యులు, రోగులకు వైద్యం చేస్తుండగా కోవిడ్ మహమ్మారితో మృతి చెందారని వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. వారి మృతికి కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ, ట్రెజరర్ కె. బాలమురళి కృష్ణ, సభ్యులు యువి రమణరాజు, జివి విశ్వేశ్వరరావు, జి రామకృష్ణంరాజు, ఎస్ అనిల్, ఎంవి రమణ, స్వరాజ్యలక్ష్మి, రంగారావు, జగదీశ్వరి, చలపతిరావు, ప్రభాకర్, చెరుకువాడ రంగసాయి, నరసింహరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1న ధర్నా -ఎపిటిఎఫ్

**విశాలాంధ్ర -భీమవరం:** రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి ఒకటో తేదీనన కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు జి .ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బీ.వీ.నారాయణ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్లు, సర్వీస్ రూల్స్ తదితర డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా చేపట్టిన ధర్నాలో ఉపాధ్యాయులందరు పాల్గనాలని వారు కోరారు.

## వైద్య ఖర్చులకు రూ.50 వేల ఆర్థిక సహాయం

**విశాలాంధ్ర-నరసాపురం:** మాట్లాడే పెదవులు కన్నా.... సాయం చేసే చేతులు మిన్న అని చెప్పిన మదర్ థెరిస్సా మాటలకు కొవ్వలి రామ్మోహన్ నాయుడు సేవలు ప్రతిరూపంగా నిలిచాయి. సంఘ సేవకులు, టిడిపి నాయకులు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు పేదల వైద్య ఖర్చులకు వేలాది రూపాయిలను ఆర్థిక సహాయం అందించి ఆయా కుటుంబాలకు అండగా నిలిచారు. ఆపదలో ఉన్నవారికి లేదనకుండా ఆర్థిక సహాయం అందించి తన సేవాతత్రృతను చాటుకుంటున్నారు. తెదేపా పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు మనుమడు తిరుమాని చోక్షిత్ శ్రీవర్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్నాడు.కొవ్వలి రామ్మోహన్ నాయుడును పెద్ది రాజు కలిసి మనవడు అనారోగ్య పరిస్థితిని వివరించారు. చిన్నారి కష్టం తెలుసుకున్న నాయుడు సహృదయంతో ఆలోచించి పెద్దిరాజు భుజం తట్టి రూ. 50వేలును కొవ్వలి ఫౌండేషన్ ద్వారా తక్షణ సహాయంగా అందించారు.

## లింగ నిర్ధారణ నియంత్రణ దుర్వినియోగం నివారణచట్టం పై అవగాహన సదస్సు

**విశాలాంధ్ర - ఏలూరు:** మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సేవాధికార సంస్థ భవనం నందు మంగళవారం జిల్లాలోని రేడియాలజిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్ లకు, పిసిఅండ్ పి ఎన్ డి టి యాక్ట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత డాక్టర్ల అనుమతితోనే పరీక్షలు నిర్వహించాలని పరీక్ష వివరాలను బయటకు వెలువరించరాదని, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వైద్య పరీక్షా కేంద్రాల పైన, హాస్పటల్ పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు.నేటి సమాజంలో భ్రూణ హత్యలు పెరిగినవని శిశువు ఆడ, మగ తెలుసుకుని పితృస్వామ్య వారసత్వ చట్టాలు, సాంస్కృతిక పద్ధతుల కారణంగా సాంప్రదాయకంగా ఆడపిల్లల కంటే మగ పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది, మగ బిడ్డ పుట్టే వరకు కుటుంబాల పిల్లల్ని కలిగి ఉండటం కొనసాగించడానికి దారితీసింది, ఆడ శిశువులను వధించడం జరుగుతుందని క్రమంగా సమాజంలో స్త్రీల సంఖ్య తగ్గిపోతుంది వీటిని నివారించడానికి చట్టాన్ని రూపొందించారని తెలియజేశారు. వైద్య పరీక్షా కేంద్రాలు ఎటువంటి ఒత్తిడిలకు తలవంచకుండా చట్టప్రకారం నడుచుకోవాలని,ప్రతి పరీక్ష కేంద్రం నందు ఈ చట్టం విధివిధానాల ప్రదర్శించే బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫారం కమిషన్ మెంబర్ కె ఎస్ నాగలక్ష్మి, డిప్యూటీ డెమో నాగరత్నం, ప్యానల్ లాయర్ జీవి భాస్కర్ జిల్లాలోని రేడియాలజిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**విశాలాంధ్ర-ఏలూరు:** ఏలూరు స్థానిక ఏ ఎస్ ఆర్ స్టేడియంలో మహిళ మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబు డెంటల్ కేర్ డాక్టర్ పుచ్చల రాజేశ్వరి బి. డి. ఎస్ ., ఎం.డి.ఎస్. రూట్ కెనాల్ దంత వైద్యులు నిపుణులు, వారి సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కర్రీ అరుణ, సెక్రెటరీ మేరీ మాణిక్యం, ట్రెజరర్ రామ్ సత్యవతి, అధిక సంఖ్యలో మహిళా వాకర్స్ ,పిల్లలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిరుపేదలకు, వాకర్స్ అందరికీ సేవలందించిన డాక్టర్‌ని వాకర్ అసోసియేషన్ సభ్యులు బొకే, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

30 లింగపాలెం 03 : గ్రామానికి వచ్చిన జేసి

## రామాలయానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్

**విశాలాంధ్ర - లింగపాలెం :** జాయింట్ కలక్టర్ లావణ్య వేణి ముడిచర్లలో పర్యటించారు. గ్రామంలోని రామాలయంలో విగ్రహాలకు కిరీటాలు అందించాలని ఆలయ కమిటీ వారు ఆహ్వానించగా ఈమె విచ్చేశారు. సీతారాములకు, లక్ష్మణ, ఆంజనేయులకు కిరీటాలు అమర్చారు. కన్నుల పండుగగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ రావి రమాదేవి కొండలు, ఆలయ కమిటీ నాయకులు తాళ్ళూరి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌ను సన్మానించారు. గ్రామానికి విచ్చేసిన ఈమెకు పలు సమస్యలు వివరించగా పరిష్కరిస్తానని తెలిపారు.

## జయరాజుకు సేవా పురస్కారం

**విశాలాంధ్ర - పెంటపాడు:** మండలంలో గృహ నిర్మాణ శాఖ ఉద్యోగిగా పనిచేస్తున్న కూరపాటి జయరాజుకు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెంటపాడు మండలంలో గృహ నిర్మాణ శాఖలో చేసిన కృషిని గుర్తించి జిల్లాలోని ఉత్తమ ఉద్యోగిగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి చేతుల మీదుగా సేవా ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ పిడి. డా.ఆర్ సి.ఆనంద్ కుమార్, డిఈ. కే వి వి ఎస్ ప్రసాద్, ఏఈ. డి.రాజేంద్ర కుమార్,ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, ఎమ్మార్వో జీవి శేషగిరి, ఎం ఏ ఓ పార్థసారథి,వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ జయరాజుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా ఉద్యోగి జిల్లా స్థాయిలో సేవ పురస్కారం అందడం మండలానికి గర్వకారణం అన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

**విశాలాంధ్ర-టీ నరసాపురం:** టీ నరసాపురంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహా వ్యక్తి గాంధీజీ అన్నారు.ఈ కార్యక్రమంలో మాదంశెట్టి మల్లికార్జున రావు, అద్దంకి రవి, అద్దంకి రామకృష్ణ, మండం ఆదిత్య కుమార్, నల్లూరి శ్రీనివాస్, పసుమర్తి రాము, పరిమి నాగేశ్వరరావు, కొనకల్ల శ్రీనివాస్, అద్దంకి జగ్గారావు, జూలూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఔను...వాళ్లిద్దరూ ఒకటయ్యారా!

**విశాలాంధ్ర - చాట్రాయి :** ఔను...వాళ్ళిద్దరూ ఒకటయ్యారా..? చూపులు కలిసిన శుభవేళ....? అంటే సినిమా టైటిల్ అనుకోకండి.... తెదేపా చాట్రాయి మండల ప్రముఖ నాయకులు సారథి సాక్షిగా చేయి చేయి కలిపిన ఫోటో సామాజిక మాధ్యమాలో చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. రోజు రోజుకి అసెంబ్లీ ఎన్నికల వేడి పెరుగుతున్న కొద్దీ ఎన్నో చిత్రాలు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఏ పార్టీ గెలుస్తుంది అనేది ఒక చర్చ అయితే తెలుగుదేశం పార్టీలో సీటు ఎవరిది అనేది ప్రధాన భూమిక పోషిస్తుంది. ప్రజా సమస్యలు, రాజకీయ విధి విధానాలకు తిలోదకాలు ఇచ్చి సీటు చుట్టూ తిరగడమే పార్టీని తిప్పడమే ప్రధాన ఎజెండాగా మారింది. తెలుగుదేశం పార్టీ నూజివీడు అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు తనకు కన్ఫాం చేసారని సహకరించాలని వైసిపి ఎమ్మెల్యే కొలుసుపార్థసారది కొద్దిమందికి ఫోన్లు చేసిన దగ్గర నుండి సారధి ఎవరెవరికి ఫోన్ చేసారు? చాట్రాయి మండలంలో నాయకుల ఫోన్ నెంబర్లు సారధికి ఇచ్చింది ఎవరు...? వాళ్ళు మొత్తం ఆ ముఠా వాళ్లే కదా...? ఇలా తీవ్రమైన చర్చలు జరుగుతున్న నేపథ్యంలో .పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో వ్యవహరిస్తున్న ప్రముఖ నాయకులు సారధి ముందు కరచాలనాలు చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇవ్వడం పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జికి నచ్చినట్లే ఉండాలని వాదించే వాళ్ళు...... ఇన్‌చార్జికి నచ్చని వాళ్ళు చివరికి ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు చేసిన ఆపదలో ఉన్న వాళ్ళని ఆదుకున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలుగా ముద్ర వేసిన వాళ్ళు ....ప్రచారం చేసిన వాళ్ళు ముద్దరబోయిన వెంకటేశ్వరరావే టిడిపి అభ్యర్థని వాదించేవాళ్లు... అతనిని ఎట్టి పరిస్థితుల్లో మార్చరనేవాళ్లు ఎవరు చెప్పారని సారధి దగ్గరకు పరుగు పరుగున వెళుతున్నారని పలువురు అంటున్నారు. 10 ఏళ్ళ నుంచి తెలుగు దేశం పార్టీని నమ్ముకుని నూజివీడులోనే తిరుగుతుంటే.. పత్రికా ముఖంగా నేనే అభ్యర్థిని అని ముద్దరబోయిన పత్రికలకు చెప్పుకుంటుంటే వైసిపి ప్రతినిధి దగ్గరకు ఎలా వెళుతున్నారని పలువురు అంటున్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను నిర్దేశిత సమయంలో ఆమోదించాలి

**విశాలాంధ్ర-ఏలూరు:** పిఎంఇజిపి లబ్దిదారులు ఆయా పరిశ్రమల ఏర్పాటుకు చేసుకునే సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు, ధరఖాస్తుల్లో లోటుపాట్లు లేకుండా అవగాహన పరచాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ హాలులో మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు మంజూరుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని , అందుకు తగిన విధంగా అధికారులు, బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పిఎంఇజిపి కింద పరిశ్రమల ఏర్పాటుకు డిఐసి, కెవిఐసి, కెవిఐబి ద్వారా బ్యాంకులకు సమర్పించే దరఖాస్తుల్లో మార్గదర్శకాలకు అనుగుణంగా సరైన రీతిలో చేసిన దరఖాస్తులు, సరైన విధానంలో సమర్పించని ధరఖాస్తులను, ఫీజిబిలిటి నివేదికల్లో కొన్నింటిని తన దృష్టికి తీసుకువస్తే వాటిలో కొన్నింటిని ఎంపికచేస్తామని వాటిని ఎంఎస్ఎంఇ శిక్షణా అవగాహన కార్యక్రమంలో లబ్దిదారులకు చూపించి వాటిలో వున్న వ్యత్యాలను చూపి వారికి అవగాహన పరచాలని పరిశ్రమల అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఎపిఐఐసి జెడ్ఎం బాబ్జి, డిపిఓ టి. శ్రీనివాస్ విశ్వనాథ్, ఉప రవాణా కమిషర్ శాంతి కుమారి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బూరుగగూడెం అభివృద్ధిపై అస్త్రం సంధించిన రామకోటయ్య

**విశాలాంధ్ర-చాట్రాయి:** గడచిన నాలుగు సంవత్సరాలుగా బూరుగుగూడెం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్,ఆర్ అండ్ బి శాఖల్లో జరిగిన అభివృద్ధిపై పనులు వివరాలు కోసం మాజీ శాసనసభ్యులు రామకోటయ్య మరో అస్త్రాన్ని సంధించారు. చాట్రాయి మండలం బూరుగూడెం గ్రామం వైకాపాకి కంచుకోట స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థులు పోటీ చేయడానికి కూడా అభ్యర్థి దొరకని గ్రామం, ప్రముఖ వైసిపి నాయకులు రాష్ట్ర నాయకుల సొంత గ్రామంలో నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య పంచాయతీరాజ్ శాఖలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల పై సమాచార హక్కు చట్టంలో సమాచారం తీసుకోవడం విశాలాంధ్రలో వార్త కథనం రావడంతో రూ.22 లక్షలతో పోసిన గ్రావెల్ రోడ్ ఎక్కడ అని గ్రామంలో చర్చలు ప్రారంభం కావడం రోడ్లు పోయడం కూడా ప్రారంభం కావడం ఆసక్తికరంగా మారింది. ఈనేపథ్యంలో రామకోటయ్య ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా జరిగిన పనులు వివరాలు కూడా తెలియజేయాలని మరోసారి సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినట్లు విశాలాంధ్రకు తెలిపారు. ఇప్పటికే గత కొన్ని నెలల క్రితం బురుగ గూడెంలో బురద మడుగులు అనే శీర్షికతో వార్తా కథనాని ప్రచురించినప్పుడు పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. డ్రైనేజీ కట్టినట్లు రికార్డు చేసి బిల్లులు మార్చుకొని ప్రభుత్వం నిధులు స్వాహా చేశారని కొంత కాలంగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో కొంతమంది సమాచార హక్కు చట్టంలో డ్రైనేజీ నిర్మాణం గురించి మండల అధికారులను వివరాలు అడిగిన అధికార పార్టీ నాయకులు ఆదేశాలకు అడుగులకు మడుగులు వత్తుతూ సమాచారం ఇవ్వలేదని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

## నిరసన దీక్షకు టిడిపి మద్దతు

**విశాలాంధ్ర - నూజివీడు టౌన్ :** చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయాలని కోరుతూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నూజివీడు నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని టిడిపి తమ నైతిక మద్దతు తెలియజేసింది. దీక్ష శిబిరాన్ని సందర్శించిన టిడిపి నూజివీడు నియోజకవర్గం ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో దూర దృష్టితో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చింతలపూడి ఎత్తిపోతలను చేపట్టారని అన్నారు. పట్టిసీమను పూర్తి చేసి గోదావరి కృష్ణ నదులు అనుసంధానం చేసిన చంద్రబాబు నూజివీడు డివిజన్లోని మెట్ట ప్రాంతం నియోజకవర్గాలైన తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం నియోజకవర్గాలలో సాగు,త్రాగునీటి కష్టాలను తీర్చేందుకు చింతలపూడి ఎత్తిపోతల ఫేజ్ -2 ను ప్రారంభించి శరవేగంగా నిర్మాణ పనులను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తలపంటి రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాపా మద్దతు:** చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ 1,2 వెంటనే పూర్తి చేయాలని కోరుతూ రైతు సంఘం చేపట్టిన నిరసన దీక్షకు టిడిపి సీనియర్ నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ రావిచెర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు దీక్ష శిబిరం సందర్శించి మద్దతు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో గాంధీ వర్ధంతి

**విశాలాంధ్ర-దేవరపల్లి:** దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర గురుకుల విద్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం ప్రిన్సిపాల్ బి. కోటేశ్వరరావు లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మానవత కన్వీనర్, దేవరపల్లి మండల బాలోత్సవ కమిటీ అధ్యక్షులు బలుసు సత్యనారాయణ పాల్గొని మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ దేశ స్వతంత్ర ఉద్యమంలో అహింస మార్గంలో నడిపించారని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల మానవత ఉపాధ్యక్షులు ఆచంట సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన రామారావు

**విశాలాంధ్ర-కొవ్వూరు :** రా కదలిరా మహాసభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి కొవ్వూరు జనసేన పార్టీ ఇంచార్జ్, టీవీ రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా టీవీ రామారావును ఆయన బాగోగులను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు నాయుడు చేతికి డప్పు ఇచ్చి ఆయన చేత వాయింప చేశారు. కొవ్వూరు నియోజవర్గం నుంచి భారీ సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు వీర మహిళలు జనసైనికులు ఆదేవిధంగా కదలిరా మహాసభకు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## వైకాపా శ్రేణులు పార్టీ విజయానికి సహకరించాలి

**విశాలాంధ్ర-కొవ్వూరు :** వైకాపాశ్రేణులు ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని గోపాలపురం ఎమ్మెల్యే, కోవూరు నియోజకవర్గ ఇన్చార్జ్ తలారి వెంకట్రావు కోరారు. కొవ్వూరు మండలం, సీతంపేట గ్రామంలో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిసి తనను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అన్న పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారయుడు, తొగుమ్మి సర్పంచ్ ఉప్పులూరు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గోకవరంలో మహాత్మా గాంధీ వర్ధంతి

**విశాలాంధ్ర- గోకవరం :** మండల కేంద్రమైన గోకవరంలో స్థానిక మహాత్మా గాంధీ సెంటర్ నందు వైకాపా ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 76 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ దాసరి చినబాబు ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ సచివాలయాలతో గ్రామ అభివృద్ధిలు పెంపొందించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, గుబ్బలమ్మ ఆలయ చైర్మన్ నరాలు శెట్టి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ రమణకు వీడ్కోలు శ్యామ్ సుందర్‌కు స్వాగతం

**విశాలాంధ్ర - తాళ్ళపూడి :** తాళ్ళపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఎస్సి సెల్ నాయకులు సిర్ర గంగారావు ఆధ్వర్యంలో తాళ్ళపూడి మండలం నుండి బదిలీ అయిన ఎస్సై కె.వి.రమణ కు వీడ్కోలు చెబుతూ, తాళ్ళపూడి మండలానికి కొత్తగా నియమించబడిన ఎస్సై శ్యామ్ సుందర్ కు స్వాగతం చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమంలో మండల ఏ.ఎస్.ఓ జోదాల వెంకట రమణ ఎస్సై రమణ సేవలను కొనియాడారు. తాళ్ళపూడి మండలానికి వచ్చిన దగ్గర్నుంచి జరిగిన అనేక సంఘటనలు మండల ప్రజల సహకారం వెలకట్టలేనిదని ఎస్సై రమణ అన్నారు. కొత్తగా వచ్చిన ఎస్సై శ్యామ్ సుందర్ కు ఆహ్వానం పలికారు. మండలం లోని పలు గ్రామాల వైకాపా నాయకులు పప్పొప్పుల నాని, ఎడ్ల నాగబాబు, జె.సి.బి. పోసిబాబు, ఎస్సి నాయకులు గూడా రాజు, గండి రాంబాబు, వి. అశోక్, సుతంగి సురేష్, సూరయ్య, యాళ్ల బాబూ రావు, ఎలిపో ప్రభాకర రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రాజోలు తాలూకా శెట్టిబలిజ యువజన సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేంద్ర

**విశాలాంధ్ర - మామిడికుదురు :** రాజోలు తాలూకా శెట్టిబలిజ యువజన సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన పితాని సురేంద్ర (సూరి) ఎన్నికయ్యారు. శెట్టిబలిజ యువ జన సంఘం సమావేశంలో తనని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారని సురేంద్ర స్థానిక విలేఖరులకు తెలిపారు. సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తన ఎన్నికకు సహకరించిన రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం పెద్దలకి, యువజన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రతపై అవగాహన

**విశాలాంధ్ర- నూజివీడు :** 35 వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా "రహదారి భద్రత మనందరి బాధ్యత" అనే అంశంపై నూజివీడు ఆటో డ్రైవర్స్, మాక్సీక్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్స్, యజమానులు రోడ్డు భద్రత పై నూజివీడు పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం ఉదయం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.నాగమురళి మాట్లాడుతూ ఆటోలో ఓవర్ లోడ్ పాసెంజర్లను ఎక్కించుకొని ప్రయాణిస్తున్న సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే, వాహన యజమానికి ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఇన్సూరెన్స్ వర్తించదని తెలిపారు.వాహనాన్ని నడిపేవారు ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ జి.నాగ మురళి, నూజివీడు డిపో మేనేజర్ సి.హెచ్. సూర్య పవన్ కుమార్, ఏలూరుజిల్లా ఆర్టీసీ పి.ఆర్.ఓ. కె.ఎల్.వి. నరసింహం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ 10 కోట్లు వైకాపా నొక్కేయాలని చూస్తోంది

**విశాలాంధ్ర - పిఠాపురం :** అన్ని కో-ఆపరేటివ్ సొసైటీల రైతుల ఇన్సూరెన్స్ బకాయిలు తక్షణమే అందించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టిడిపి కార్యాలయం నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక చర్చి సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ నియోజవర్గంలో అన్ని కో-ఆపరేటివ్‌లో బకాయిలు సుమారుగా 10 కోట్ల రూపాయలు ఉన్నాయని, తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని పిఠాపురం తెలుగుదేశం పార్టీ ఏలేరు రైతాంగం తరుపున డిమాండ్ చేస్తోందన్నారు. అనంతరం కో ఆపరేటివ్ పిఠాపురం బ్యాంక్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు.

## జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పదవ స్నాతకోత్సవం

**విశాలాంధ్ర - కాకినాడ :** జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పదవ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం ఉదయం 10.30 గంటల నుండి అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించనున్నామని ఉపకులపతి డాక్టర్ జీవిఆర్ ప్రసాదరాజు వెల్లడించారు. మంగళవారం యూనివర్సిటీలోని విసి హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవం సందర్భంగా 2022-2023 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తారని తెలిపారు. 10వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదానం చేయనున్న డిగ్రీల వివరాలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేశారు. బీటెక్-34,199, బీ-ఫార్మసీ-1477, ఎంటెక్-1689, ఎంబిఏ-1093, ఎంసిఏ-343, ఎం ఫార్మసీ-332, బిబిఏ-21, ఫార్మా-డి-182, మరియు బీ-ఆర్క్-13, మంది విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రదానం చేస్తారన్నారు. అలాగే ఈ స్నాతకోత్సవంలో 64మంది రీసెర్చ్ స్కాలర్స్ పిహెచ్ డిగ్రీలు అందుకోనున్నారన్నారు. అలాగే ఛాన్సలర్ మరియు ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డులు, 28 బంగారు పతకాలు కూడా అందజేస్తారన్నారు. ఈ స్నాతకోత్సవానికి కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్ వెంకట శేషాచారి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) టెక్నాలజీ, సాఫ్ట్వేర్ & సర్వీసెస్ ప్రెసిడెంట్ వి రాజన్న కి జెఎన్టియుకె తరపున గౌరవ డాక్టరేటు ప్రధానం చేయనున్నట్టు తెలిపారు. బుధవారం జరిగే స్నాతకోత్సవ వేడుకలకు పాలక మండలి సభ్యులు, మాజీ ఉపకులపతులు, అతిథులు, విద్యావేత్తలు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు, ఉన్నత విద్యాశాఖాధికారులు, జిల్లా అధికారులు, విద్యావేత్తలు, జెఎన్టియుకె టీచింగ్ & నాన్ టీచింగ్ స్టాఫ్, పిహెచ్ అవార్డు గ్రహీతలు, గోల్డ్ మెడలిస్టు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఉపకులపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి రమణ, రిజిస్ట్రార్ ప్రొ ఎల్ సుమలత, ఓఎస్డి డి. కోటేశ్వరరావు, ఆర్ & డి డైరెక్టర్ ప్రొ వి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సత్యం, అహింసా మార్గంలో నడవండి

**విశాలాంధ్ర - కాకినాడ :** కాకినాడ స్థానిక గాంధీనగర్ అలయన్స్ క్లబ్ అఫ్ స్వాతి హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు అలై కిరణ్ కుమార్ అధ్యక్షతన గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్యవిభాగ కార్యనిర్వాహక కార్యదర్శి అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా డిస్ట్రిక్ట్ 106 పూర్వ గవర్నర్ అలై కొవ్వూరి మునిరెడ్డి, గౌరవ అతిథిగా క్లబ్స్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సత్యం, అహింసా మార్గంలో నడవాలని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ అహింసా మార్గంలో బ్రిటిష్ వారితో స్వాతంత్ర పోరాటం చేసారని, ప్రస్తుత కాలంలో యువత ఎక్కువగా చెడు అలవాట్లకు బానిసలై ప్రక్కదారి పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అలై పెంకే గోవిందరాజు, మెర్లో మెంబర్ అలై సిహెచ్ వరప్రసాద్, జెడ్‌సి అలై దుర్గా సుభద్ర, అలై గణేష్, అలై మణికంఠ అలై నీలపాల శ్రీనివాస్, అలై మద్దా వికాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగి పై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు

**విశాలాంధ్ర - యు కొత్తపల్లి :** కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మత్స్యశాఖ సహాయకుడు పరశురాంపై దాడి చేసిన సంఘటన జరిగింది. వైకాపా నాయకుడు రావు చిన్నారావు ఆధ్వర్యంలో వైకాపా కార్యకర్తలు తనపై ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని మత్స్య శాఖ సహాయకుడు పరశురాం మంగళవారం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రొయ్యల చెరువులకు రాయితీ ఇవ్వలేదని, అక్కసుతో రావు చిన్నారావు దుర్భాషలాడి దౌర్జన్యం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుంది. ప్రాథమిక విచారణ చేసి కొత్తపల్లి ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత బస్సు హామీ ఇవ్వొద్దు

**విశాలాంధ్ర - సామర్లకోట :** సామర్లకోటలోని ఆటో కార్మికులు ఉచిత బస్సు హామీ ఇవ్వద్దు ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు అంటూ స్టేషన్ సెంటర్ వద్ద నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అన్ని ఆటో యూనియన్ నాయకులు రింగ్ సెంటర్ వద్దకు చేరుకుని అక్కడి నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్నంలో ఆటో నాయకులు మాట్లాడుతూ సుమారు ఆటోలు పై ఆధారపడి ఆంధ్ర రాష్ట్రంలో 10 లక్షల మంది బతుకుతున్నారని, పరోక్షంగా మరో రెండు లక్షల మంది బతుకుతున్నారని ఇప్పుడున్న ప్రభుత్వం గానీ ప్రతిపక్ష పార్టీలు గానీ హామీ ఇస్తే ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారని వారు అన్నారు.

## ఆటో కార్మికుడు తిరపయ్యకు కార్మికుల సంతాపం

**విశాలాంధ్ర - అమలాపురం :** అంబేద్కర్ కోనసీమ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అమలాపురం వారి జనరల్ బాడీ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక బండి వారి పేటలో గల కమ్యూనిటీ హాల్లో ఊటాల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యంగా ఈ సమావేశంలో తొలుత కలశం యూనిట్ సీనియర్ కామ్రేడ్ పనసా తిరపయ్య ఆకస్మిక మృతికి సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంఘం ద్వారా తెలియజేస్తూ వారి ఆత్మ శాంతించాలని తీర్మానం ప్రవేశ పెట్టారు. తదుపరి సంఘాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలకు రాబోయే ఏప్రిల్ 14 అంబెద్కర్ జయంతి ఘనంగా జరిపించుకునేందుకు తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. ఈ సమావేశంలో సీనియర్ ఆటో నాయకులు కాశీ, కరుణాకర్. చిల్లే సత్యనారాయణ, మొక్క శ్రీను, పుచ్చకాయల సత్తిబాబు, రొక్కాల సత్యనారాయణ, బొంతు సత్తిబాబు, చెల్లూరి రాజేష్, అయితాబత్తుల సురేష్, చెల్లూరి తాతాజీ, ఉలింగి చిన్ని, పండు, ఈతకోట బాలాజీ, పచ్చిమాల రమణ, అయితా బత్తుల సుబ్బారావు మరియు 40 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## మీ అందరి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తాను

**- డ్వాక్రా మహిళల ఆసరా సభలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు**

**విశాలాంధ్ర-పోడూరు:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మీ అందరి ఆశీస్సులతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పాలు పంచుకుంటానని ఆచంట ఎమ్మెల్యే చెరుకూరి శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని తూర్పు పాలెం క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం నుండి వచ్చే నెల 8వరకూ నియోజకవర్గం స్థాయిలో జరుపనున్న డ్వాక్రా మహిళలకు మనసారా ఆసరా కార్యక్రమాన్ని మెదటి రోజున రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున హాజరైయ్యారు.నాలుగు మండలాల నుంచి సుమారు 5 వేల మంది కార్యక్రమానికి పాల్గొన్న డ్వాక్రా మహిళలకు భోజనాలు పెట్టి చీరలు అందించారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, పోడూరు జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు పలు గ్రామాల సర్పంచ్ లు ఎంపీటీసీ లు వైసీపీ మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టులపై సమీక్ష

**విశాలాంధ్ర - సామర్లకోట :** సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ లిస్టులపై రిటర్నింగ్ అధికారి పెద్దాపురం ఆర్డీవో సీతారామారావుతో సమీక్ష నిర్వహించారు. సామర్లకోట ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ రామారావు మరో ఐదుగురు సూపర్వైజర్లతో కలిసి నిర్వహించిన సమీక్ష కార్యక్రమంలో ఓటర్ లిస్టులో డెత్ ఓటర్ల పైన లిస్టులో ఫోటోలు క్లారిటీ పైన పిడబ్ల్యుడి ఓటర్ పైన పలు సూచనలు సలహాలు సీతారామారావు అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బూతు లెవెల్ అధికారులు పాల్గొన్నారు.